RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 8 మంగళవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 215 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | TUESDAY SEPTEMBER 8 2026 | VOL:16 | ISSUE: 215 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం రేవంత్ రెడ్డి

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

- అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్
- వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి
- స్పీకర్ తల్లి ప్రస్తావనపై సీతక్క ఆవేదన



తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా, దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉదయం అసెంబ్లీ వెలుపల తాతా మధు చేసిన

(మిగతా 2వ పేజీలో..)

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ



తెలంగాణ శాసనసభ సమావేశాల వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్

(మిగతా 2వ పేజీలో..)

## విపక్షం గెలిస్తే రాహుల్‌కు ప్రధాని పదవిపై హక్కు ఉంటుంది: సీపీఎం నేత ఎంఏ బేబీ

- ప్రతిపక్ష నాయకుడిగా ఆయనకు ఆ హక్కు సహజంగా ఉంటుందన్న సీపీఎం నేత
- ప్రధాని ఎవరనేది ఎన్నికల తర్వాతే పార్టీలు నిర్ణయిస్తాయని స్పష్టీకరణ
- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమన్న బేబీ

లోక్‌సభలో విపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీకి, రానున్న ఎన్నికల్లో విపక్ష కూటమి అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి పదవిని క్లెయిమ్ చేసే సహజమైన హక్కు ఉంటుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే, ప్రధాని ఎవరనేది ఎన్నికల ఫలితాల తర్వాతే పార్టీలన్నీ కలిసి నిర్ణయించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "సాధారణంగా ప్రతిపక్ష నాయకుడికి ఆ హక్కు ఉంటుంది. ఎన్నికల్లో విపక్షాలు విజయం సాధించాక, పార్టీలన్నీ కూర్చుని ప్రధాని ఎవరనే దానిపై పరిణతితో నిర్ణయం తీసుకుంటాయి" అని బేబీ వివరించారు. ఈ విషయంలో సీపీఐ(ఎం) ఎలాంటి క్లెయిమ్ చేయదని "మాకున్న బలంతో మేం క్లెయిమ్ చేయడం హాస్యాస్పదం అవుతుంది. కాబట్టి సహజంగా విపక్ష నాయకుడికి క్లెయిమ్ చేసే హక్కు ఉంటుంది" అని ఆయన అన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న

(మిగతా 2వ పేజీలో..)



## అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

- 22-ఏపై చర్చకు బీజేపీ సభ్యుల పట్టు
- భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు
- బీఆర్ఎస్ తో బీజేపీ కుమ్మక్కయిందన్న కోమటిరెడ్డి



తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభలో బీజేపీ సభ్యుల గందరగోళంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించగానే, బీజేపీ ఎమ్మెల్యేలు 22-ఏ నిషిద్ధ భూముల అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని పట్టుబడుతూ ప్లకార్డులతో

(మిగతా 2వ పేజీలో..)

## మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం.. డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో

(మిగతా 2వ పేజీలో..)



## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్

- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల

(మిగతా 2వ పేజీలో..)



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## సంపాదకీయం

# చెట్టు ఉంటేనే రేపటి ఊపిరి

అభివృద్ధి పేరుతో ప్రకృతిని కోల్పోతే భవిష్యత్ తరాలకు మిగిలేది ప్రశ్నార్థకమే

అభివృద్ధి అనేది సమాజానికి అవసరం. రహదారులు కావాలి.. భవనాలు కావాలి.. పరిశ్రమలు రావాలి.. కొత్త నగరాలు నిర్మించాలి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే మౌలిక వసతుల అభివృద్ధి తప్పనిసరి. కానీ ఈ అభివృద్ధి ప్రకృతిని పణంగా పెట్టి సాగితే మాత్రం భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పు తప్పదు. మనిషి అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రకృతికి దూరమవుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ పెద్ద సంఖ్యలో చెట్లు కనిపించేవి. ఇప్పుడు రోడ్ల విస్తరణ, భవనాల నిర్మాణం, పార్కింగ్ అవసరాలు వంటి కారణాలతో పచ్చదనం తగ్గుతోంది. చెట్లు తగ్గిపోతే ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం అసమతుల్యం కావడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వంటి సమస్యలు మరింత తీవ్రం కావచ్చు. వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రకృతి సమతుల్యత దెబ్బతింటున్నదానికి ఒక హెచ్చరికగానే చూడాలి.

పచ్చదనం లేకుండా ప్రగతి సాధ్యమేనా?

ప్రగతి అంటే కాంక్రీట్ భవనాలు మాత్రమే కాదు. స్వచ్ఛమైన గాలి, తాగునీరు, పచ్చని వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనం కూడా అభివృద్ధిలో భాగమే. నగరాల్లో ఫ్లైఓవర్లు, రహదారులు నిర్మించడం ఎంత ముఖ్యమో.. వాటి వెంట పచ్చదనాన్ని పెంచడం కూడా అంతే ముఖ్యం.ప్రతి అభివృద్ధి ప్రాజెక్టులో పర్యావరణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. చెట్ల తొలగింపు అనివార్యమైతే అంతకంటే ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలి.

మొక్క నాటడం కంటే సంరక్షణ ముఖ్యం

మొక్కలు నాటే కార్యక్రమాలు తరచూ జరుగుతుంటాయి. కానీ నాటిన మొక్కల్లో ఎన్ని బతుకుతున్నాయన్నదే అసలు ప్రశ్న. ఫొటోలు దిగడం, ప్రచారం చేయడం కంటే మొక్కలను పెంచే బాధ్యతను తీసుకోవాలి. ఒక మొక్క నాటడం మొదటి అడుగు మాత్రమే. అది చెట్టుగా మారే వరకు సంరక్షించడం అసలు బాధ్యత.ప్రభుత్వ సంస్థలతో పాటు స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే పచ్చదనం పెరుగుతుంది. ప్రతి కుటుంబం తన పరిసరాల్లో కనీసం కొన్ని మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకుంటే మార్పు వేగంగా కనిపిస్తుంది.ప్రకృతిని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడుకోవడమేపర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ కార్యక్రమమూ విజయవంతం కాదు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకపోవడం, నీటిని వృథా చేయకపోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను సంరక్షించడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు పునాది. మనకు ప్రకృతి నుంచి ఎంతో లభిస్తోంది. కానీ తిరిగి ప్రకృతికి మనం ఏమిస్తున్నామన్నది ఆలోచించాల్సిన సమయం ఇది. అభివృద్ధి కావాలి.. కానీ ప్రకృతిని నాశనం చేసి కాదు. ఆధునికత కావాలి.. కానీ పర్యావరణాన్ని విస్మరించి కాదు. రేపటి తరాలకు మనం ఆస్తులు మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కూడా అందించాలి. మనం నాటిన ఒక చెట్టు రేపటి తరానికి ఒక ఊపిరి. అందుకే అభివృద్ధికి వేగం ఎంత అవసరమో.. ప్రకృతికి రక్షణ అంతకంటే అవసరం.

# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం.. డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

మొదటి పేజీ తరువాయి)

సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య

వలిగొండ:సెప్టెంబర్ 07 (దేశ టైమ్స్):



తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్ తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది ప్రజాస్వామ్యానికి, శాసనసభ గౌరవానికి ప్రతీక అని అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పని పక్షంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

## ఉద్యోగాల పేరుతో మోసం: ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

### శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్

### లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## అసెంబ్లీలో రచ్చ.. బీజేపీకి అన్నింట్లో రాజకీయాలే కావాలంటూ కోమటిరెడ్డి ధ్వజం

మొదటి పేజీ తరువాయి)

సభాప్రాంగణంలోకి దూసుకెళ్లారు. స్పీకర్ కల్పించుకుని... బీఏసీ సమావేశంలో చర్చించి 22-ఏపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు తగ్గలేదు. భూ దందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు మరోవైపు, బీజేపీ సభ్యుల తీరుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సభలో ఏ అంశంపైనైనా సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే, బీజేపీ నాయకులకు మాత్రం అన్నింట్లో రాజకీయాలే కావాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ. లక్ష కోట్ల మేర భారీ అవినీతి జరిగిందని, దానిపై సీబీఐ విచారణ జరిపించాలని ఏడాది క్రితం లేఖ రాసినా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్‌తో లోపాయికారీగా కుమ్మక్కై విచారణ జరగకుండా బీజేపీ అడ్డుపడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం అవినీతి బయటకు రాకుండా స్వయంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే అడ్డుపడుతున్నారని కోమటిరెడ్డి మండిపడ్డారు. మరో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... సభకు బీజేపీ సభ్యులు సహకరించాలని విన్నవించారు. ప్రొసీజర్ ప్రకారం సభ నడవాలని అన్నారు. 22-ఏపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## విపక్షం గెలిస్తే రాహుల్‌కు ప్రధాని పదవిపై హక్కు ఉంటుంది: సీపీఎం నేత ఎంఏ బేబీ

మొదటి పేజీ తరువాయి)

తరుణంలో విపక్షాల ఐక్యత, నాయకత్వంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో బేబీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికలకు ముందు నాయకత్వంపై అనవసర ఊహాగానాల్లోకి వెళ్లడం తమ ఉద్దేశం కాదని, బీజేపీ/ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా 1996లో యునైటెడ్ ఫ్రంట్ హయాంలో జ్యోతి బసు ప్రధాని పదవి అంశంపై పార్టీ సెంట్రల్ కమిటీలో జరిగిన చారిత్రక చర్చను ఆయన గుర్తుచేసుకున్నారు. రాహుల్ గాంధీని తమ పార్టీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం లేదని, కేవలం లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడిగా ఆయనకు ఉన్న సహజమైన హక్కు గురించి మాత్రమే ప్రస్తావించానని బేబీ స్పష్టం చేశారు.

## అసెంబ్లీలో ఊహించని పరిణామం.. కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్

మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభల గౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నారు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఛైర్‌లో ఉండగానే కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో సభలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. మంత్రి సీతక్క కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు బాధాకరం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ భావోద్వేగానికి గురయ్యారు. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తులు అత్యున్నత పదవుల్లో ఉండటాన్ని కొందరు ఓర్వలేకపోతు న్నారని బీఆర్ఎస్‌పై విమర్శలు చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# బాల్య వివాహాల నిర్మూలనకు భువన్ రిభు పోరాటం.. అంతర్జాతీయ గుర్తింపు!





**నవంబర్ 27న అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం**

**జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభుకు అశ్రిత సంస్థ మరియు పలువురు వక్తల ప్రత్యేక ధన్యవాదాలు**

తేది 07-09-2026 రోజున అశ్రీత స్వచ్ఛంధ సంస్థ నల్లగొండ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో “” బాలల న్యాయమైన హక్కుల కోసం సాగిన ఉద్యమానికి ఐక్యరాజ్యసమితి గుర్తింపు మరియు బాల్య వివావాహల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర” అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో బాల్య వివాహాల నిర్మూలన కోసం జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు సాగించిన నిరంతర పోరాటానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం పట్ల వక్తలు హర్షం వ్యక్తం చేశారు. నవంబర్ 27ను అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవంగా గుర్తించే దిశగా ఐక్యరాజ్యసమితి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించింది. పిల్లల న్యాయమైన హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన కోసం భువన్ రిభు నేతృత్వంలో సాగుతున్న ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించిందని పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు చేసిన కృషికి భువన్ రిభు, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ కు అభినందనలు తెలిపారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి హిమ బిందు పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలను కేవలం సామాజిక సమస్యగా కాకుండా బాలల హక్కుల ఉల్లంఘనగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు పిల్లల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయి నుంచి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బాలికకు విద్య, రక్షణ, సమాన అవకాశాలు అందేలా సమాజంలోని అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని కోరారు.అశ్రిత డైరెక్టర్ ఎస్. నాగరాజు మాట్లాడుతూలి.. బాల్య వివాహాల నిర్మూలనకు చట్టపరమైన చర్యలతో పాటు సామాజిక చైతన్యం అవసరమన్నారు. పాఠశాలలు, పంచాయతీలు, గ్రామాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలికల విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అశ్రిత ఆధ్వర్యంలో జరగబోయే బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు.లిభువన్ రిభు, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థకు అశ్రిత తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తూ.. బాలల న్యాయమైన హక్కుల కోసం సాగుతున్న ఉద్యమం మరింత బలోపేతం కావాలని, బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణం కోసం ఈ కృషి మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, సిడిపిఓ వేణు, రిసోర్స్ పర్సన్ డేవిడ్ కుమార్, అశ్రీత సంస్థ జిల్లా కో. ఆర్డినేటర్ శోభారాణి, డిసిపియు ఆఫీసర్ తేజ, AHTU విజయలక్ష్మి, కృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు, సంస్థ కార్యకర్తలు విద్యార్థినిలు పాల్గొన్నారు

**ఇట్లు**
**యం శోభారాణి**
**అశ్రీత సంస్థ జిల్లా కో ఆర్డినేటర్**

# టీబీ పేషెంట్లకు ఆరు నెలల పాటు పోషకాహారం అందేలా చర్యలు: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి







**ఖమ్మం, సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్):**

జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిక్షయ్ కార్యక్రమం కింద టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని పేషెంట్లకు కిట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సుమారు 3,000 మంది టీబీ పేషెంట్లు ఉన్నారని తెలిపారు. ప్రతి పేషెంట్‌కు ఆరు నెలలకు సరిపడా పోషకాహారం అందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు సత్యసాయి సొసైటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రతి టీబీ పేషెంట్‌కు న్యూట్రిషన్ కిట్లు అందించే బాధ్యత తీసుకోవాలని కోరారు.ఎక్కువ మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో సుమారు 12 వేల న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశామని, ప్రస్తుతం కిట్ల పంపిణీ సంఖ్య తగ్గిందని తెలిపారు. రెడ్‌క్రాస్, సత్యసాయి సొసైటీలు ఈ అంశంపై సమీక్ష నిర్వహించి, జిల్లాలోని ప్రతి టీబీ పేషెంట్‌కు నిరంతరం పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు మాట్లాడుతూ టీబీ నుంచి త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు పోషకాహారం తీసుకోవడం ఎంతో కీలకమని తెలిపారు. నిక్షయ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.న్యూట్రిషన్ కిట్‌లో పల్లీలు, 1.5 కిలోల పప్పు, 1 కిలో బియ్యం, పావు కిలో వంట నూనె ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆది శ్రీనివాస్ అభివృద్ధిపై బీఆర్ఎస్, బీజేపీ విమర్శలు సరికావు: కాంగ్రెస్ నేతలు

**రుద్రంగి సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్)**

రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేసిన విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య, సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి గ్రామానికి బీజేపీ నాయకులు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొబ్బరికాయలు కొట్టడం తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రజల్లో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధిలో పోటీ పడాలి కానీ విమర్శల్లో కాదని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఎర్రం అరవింద్, అంబటి శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, గట్ల మీనయ్య, చెలుకల శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెర

- **సెయింట్ ఆగస్టీన్స్ హైస్కూల్ గల్లీ రోడ్డుకు మహర్దశ**
- **సైడ్ డ్రైనేజీ, తారు రోడ్డు పనులకు శ్రీకారం**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 7:**



నాలుగు దశాబ్దాలుగా అధ్వానంగా ఉండి విద్యార్థులు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న సెయింట్ ఆగస్టీన్స్ హైస్కూల్ గల్లీ రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మరిపెడ మున్సిపాలిటీ 14వ వార్డు పరిధిలోని ఈ రహదారిలో సైడ్ డ్రైనేజీ, తారు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు.ఏళ్ల తరబడి రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, పాఠశాల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడేవారు. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉండేది.స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ కృషితో రహదారి అభివృద్ధి పనులకు మంజూరు లభించింది. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ కంచర్ల నరేష్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.సైడ్ డ్రైనేజీ నిర్మాణంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోకుండా చర్యలు చేపట్టడంతో పాటు, అనంతరం తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేయనున్నారు. పనులు పూర్తయితే పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయి.నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న తమ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జాటోతు సురేష్, మెరుగు రాము, కోఆప్షన్ సభ్యుడు గుండగాని వెంకన్న, అలువాల ఉపేందర్ ప్రజాపతి, యాకయ్య, పడిదం రాధిక, అన్వేష్, లక్ష్మారెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు.. 420 హామీల సంగతేంటి?

**ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి.**

**దేశ టైమ్స్ మహబూబాబాద్/,మరిపెడ, సెప్టెంబర్ 7:**



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మహబూబాబా ద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల సమయంలో ప్రకటించిన ఇతర హామీలను కూడా అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం కారణంగా వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వ హామీల అమలు అంశాన్ని ప్రస్తావిస్తూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా కాకుండా నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేయాలని కోరారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని, ఇచ్చిన హామీలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆరెస్ ఎమ్మెల్యేల అరెస్టును ఖండిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన

**రుద్రంగి సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో బిఆరెస్ పార్టీ మండల అధ్యక్షుడు దెగవత్ తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల కు వెళ్తున్న బిఆరెస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేయించిన కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 420 దొంగ హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పాలనలో ఎవరూ సంతోషంగా లేరని, ప్రజలు కూడా హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి హామీలు ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేయడం తెలియదని ఎద్దేవా చేశారు. వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యమని, హామీలు కూడా అమలు కాలేదని విమర్శించారు. బిఆరెస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తే, కాంగ్రెస్ మూడేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని అన్నారు.వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని, లేకుంటే బిఆరెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## రోడ్డుపై అక్రమంగా బోరు వేసిన వ్యక్తిపై కేసు

**రుద్రంగి సెప్టెంబర్ 7(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో ఆదివారం రాత్రి 9 గంటలకు రుద్రంగి గ్రామానికి చెందిన బోయిని రాజు,అను అతను ఎలాంటి పర్మిషన్ లేకుండా తన ఇంటి ముందు రోడ్డుపై బోర్వెల్ తో ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా బోరు వేయగా ఇట్టి విషయం సమాచారం రాగా సంఘటన స్థలం పరిశీలించి బోయిని రాజు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ మోతిరామ్ తెలిపారు.ప్రభుత్వ స్థలాలలో కానీ రోడ్లపై గాని ఎవరైనా అనుమతులు లేకుండా బోరువేసిన, అంతేకాకుండా ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు అంతరాయం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని రుద్రంగి ఎస్ఐ మోతీరామ్ హెచ్చరించారు.

RNI NO . TELTEL2010/34557

తెలుగు దినపత్రిక

దేశటైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

# దళిత స్పీకర్ ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరుపై నిరసన

**రుద్రంగి సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్)**



తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు,దళిత సంఘాల నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అసెంబ్లీ గేటు వద్ద స్పీకర్ ను ఉద్దేశించి ఏకవచనంతో, అసభ్యంగా మాట్లాడడం రాజ్యాంగ పదవికే అవమానమని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి సర్పంచ్ గండి నారాయణ, దయ్యాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ...ఒక దళితుడు స్పీకర్ గా ఉంటే ఓర్వలేక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. ఆయన అధ్యక్షా అని పిలవడానికి కూడా అహం అడ్డొస్తోంది. నాయకుడి బాటలోనే ఆ పార్టీ నేత తాతా మధు కూడా స్పీకర్ ను అడుగడుగునా అవమానిస్తున్నారు. నిన్న కేసీఆర్ ఇదే చెప్పి అసెంబ్లీకి పంపించాడా అని అనుమానం వస్తోంది. దళిత స్పీకర్ పై ఇలాంటి భాష వాడటం బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనం అని విమర్శించారు. తాతా మధుపై వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,గట్ల మీనయ్య, తర్రె మనోహర్, కట్కూరి దాసు,అక్కినపెల్లి శ్రీనివాస్,దయ్యాల రమేష్,దాసరి గంగారాజం, ప్రశాంత్,శ్రీకాంత్,శ్రీధర్,అశోక్ తదితరులు పాల్గొన్నారు...

# పారదర్శకంగా అంగన్వాడి టీచర్ పోస్టులు భర్తీ!

**మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎం.ఎల్లమ్మ,**

**దేశ టైమ్స్ మహబూబాబాద్మరిపెడ, సెప్టెంబర్ 07**



మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టులోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టులను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మరిపెడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని ఎం. ఎల్లమ్మ అన్నారు. సోమవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి టీచర్ పోస్ట్ లకు దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ! జిల్లా అధికారులఆదేశానుసారం, ప్రభుత్వ నియమ ,నిబంధనలకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేదన్నారు. ఆయా పోస్టుల రిజర్వేషన్ ప్రకారము మెజార్టీ అభ్యర్థులకు మాత్రమే పోస్టులను కేటాయిస్తున్నామన్నారు. మహిళాఅభ్యర్థులుదళారులననమ్మొద్దన్నారు. ఎలాంటి రాజకీయ నాయకులు,డబ్బు ,ప్రమేయంలేకుండా నిష్పక్షపాతంగా! మెరిట్ అభ్యర్థులను మాత్రమే! ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్ పోస్టుల కు దరఖాస్తు చేసిన మహిళా అభ్యర్థులు సకాలంలోత్వరితగతినకార్యాలయం లకు చేరుకొని తమసర్టిఫికెట్లనుపరిశీలించు కోవాలనికోరారు. ఈసర్టిఫికెట్లపరిశీలనలో ఏ సి డి పి ఓ రోజారాణి,సూపర్వైజర్లుఉషారాణి,రాజ్యలక్ష్మి, మంగాదేవి,శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించాలని ప్రజావాణిలో దరఖాస్తు అందజేత

**సంగిశెట్టి క్రిస్టఫర్ జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు**

**వలిగొండ :సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్)**




స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమందిని ఆదుకోవడానికి వేగంగా అడుగులు వేయాలని వారు అన్నారు.

# బిజెపి నాయకులను ముందస్తు అరెస్ట్


**వలిగొండ, సెప్టెంబర్ 07 (దేశ టైమ్స్):**




భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని బిజెపి లడాయి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు మండలం నుండి తరలి వెళ్లకుండా స్థానిక పోలీసులు బిజెపి నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చేసే కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనం అని, అరెస్టుల ద్వారా బిజెపి నిర్వహించే ప్రజా పోరాటాలను అడ్డుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్ రెడ్డి, రాచకొండ కృష్ణ, మైసొల్ల రామనర్సు, మండల నాయకులు మందుల నాగరాజు, బుంగమట్ల చిన్న మహేష్, పోలు నాగయ్య, సంకబుడ్డి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీలో అవకతవకలు







**వలిగొండ, సెప్టెంబర్ 07 (దేశ టైమ్స్):**

మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్ ల పంపిణీపై వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ బరువు తక్కువగా ఉందనే అనుమానంతో బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు బంధారపు రాములు ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి సిబ్బంది సమక్షంలో సిలిండర్‌ను తూకం వేయించగా 2.50 కిలోల బరువు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. సిలిండర్‌లో ఎలాంటి సమస్య లేదని, ఇండియన్ గ్యాస్ కంపెనీ నుంచి సిలిండర్లు అలాగే వస్తున్నాయని ఏజెన్సీ మేనేజర్ వంశీ చెప్పినట్లు రాములు పేర్కొన్నారు. సిలిండర్‌ను వినియోగదారులకు అందించే సమయంలో తూకం పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, అనేక సందర్భాల్లో తూకం వేయకుండానే ఇంటి వద్ద డెలివరీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తనిఖీ కోసం సుమారు రెండు గంటలు నిరీక్షించిన అనంతరం రాకేష్ అనే వ్యక్తి వచ్చి సిలిండర్‌ను పరిశీలించి వాల్వ్ సరిగా లేదని తెలిపినట్లు చెప్పారు. మండలంలో సిలిండర్ల డెలివరీకి ఒక్క వ్యక్తినే ఉపయోగించడం కూడా గమనార్హమన్నారు. అదే విధంగా కార్యాలయానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు డెలివరీ చార్జీలు వసూలు చేయకూడదని, అయినప్పటికీ వినియోగదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ ఏజెన్సీలో జరుగుతున్న అవకతవకలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని, వినియోగదారులకు న్యాయం చేయాలని రాములు కోరారు.

# వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో ఘనంగా మెడికల్ క్యాంప్

**ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు -- అధ్యక్షులు మారేమల్ల రామకృష్ణ**

**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 7(దేశ టైమ్స్)**



వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మారేమల్ల రామకృష్ణ నేతృత్వంలో మెడికల్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. క్యాంప్‌కు హాజరైన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బంది తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి వైద్యపరమైన సూచనలు, సలహాలు అందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ సెక్రటరీ సుగ్గల శ్రీహరి, ట్రెజరర్ కురువెళ్ల గోపాలకృష్ణమూర్తి, నల్ల భాన, వల్లాల యుగేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే VN Diamond KCGF శ్రేయోభిలాషి, వాసవి ధాత కడవెండి శ్రీనివాస్ (ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్), VN Golden KCGF ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గెల్ల కృష్ణవేణి, ఎచీ Golden KCGF వాసవి ధాత గుమ్మడవెల్లి శ్రీనివాస్, VN Silver KCGF గోళ్ల రాధాకృష్ణమూర్తి, మాశెట్టి వరప్రసాద్, కొదుమూరు జగన్నాథం, రాయల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. RC దాస శ్రీనివాస్, RS బోర్ల పుల్లారావు, ఎర్రం రామకృష్ణ, జ మోహన్ దాస్, మోహనరావు, విశ్వనాథం, బిక్షామయ్య, శ్రీనివాస్, అయ్యగారు రామకృష్ణ తదితరులతో పాటు మహిళలు, వాసవి క్లబ్ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అందరి సహకారంతో మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ప్రజా గొంతుకను అణచివేస్తే ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెబుతాం

**అసెంబ్లీకి వెళ్లే ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం**

**ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: లింగాల కమల్‌రాజు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 7 (దేశ టైమ్స్):**

ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకోవడం, వారిని అరెస్టులు చేయించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరమైన పరిణామమని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం ప్రతిపక్షాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించకుండా నిరోధించడం ద్వారా ప్రజల సమస్యలను పక్కన పెట్టలేరని ఆయన స్పష్టం చేశారు. అరెస్టులకు నిరసనగా సోమవారం బోనకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కమల్‌రాజు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరును నిరసించారు.

**ప్రజలు ఎన్నుకున్న వారినే సభకు రానివ్వరా?**


ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం అసెంబ్లీకి వెళ్లడం లేదని, తమను ఎన్నుకున్న ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే సభకు వెళ్తున్నారని అన్నారు. అలాంటి ప్రజాప్రతినిధులను సభకు హాజరుకాకుండా ముందస్తుగా అరెస్టులు చేయించడం ద్వారా ప్రజల గొంతును కూడా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు లేకపోతే అసెంబ్లీ వ్యవస్థకు అర్థమేంటని ప్రశ్నించారు. అధికార పక్షం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని సమర్థించడమే ప్రతిపక్షాల పని కాదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే అంశాలను సభలో ప్రస్తావించి ప్రభుత్వాన్ని సమాధానం చెప్పేలా చేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.

**హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కమల్‌రాజు అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు ఎక్కడ? రైతు భరోసా పరిస్థితి ఏమిటి? యువతకు ప్రకటించిన ఉద్యోగాల పరిస్థితి ఏమిటి? మహిళలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలయ్యాయి? పేదలకు ఇళ్ల నిర్మాణం ఎంతవరకు జరిగింది అంటూ ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని, ఇప్పుడు అదే ప్రజలు తమ హామీల అమలుపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన సమయంలో ప్రతిపక్ష నాయకులపై అరెస్టులు, నిర్బంధాలు ప్రయోగించడం సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు.

**అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరు**

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేయడం ద్వారా ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని దాచిపెట్టలేరని కమల్‌రాజు అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతి గొంతును అణచివేయాలని చూస్తే బీఆర్ఎస్ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో ప్రతిపక్షానికి కూడా అంతే ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. శాసనసభలో చర్చ, ప్రశ్నలు, సమాధానాల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనాలని సూచించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, వాటిపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజల నుంచి తప్పించుకోలేదని కమల్‌రాజు అన్నారు. అసెంబ్లీ వేదికతో పాటు గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాల స్థాయిలో ప్రజా సమస్యలను ఎత్తిచూపుతామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తామని, అవసరమైతే మరింత విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు, బోనకల్ ఉపసర్పంచ్ బానోత్ కొండ, సర్పంచ్ బానోత్ జ్యోతి, మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పార ప్రసాద్, మాజీ రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్, గుండపనేని సుధాకర్‌రావు, బంధం నాగేశ్వరరావు, ఎస్సీ విభాగం నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, కనకయ్య, కంచర్ల అచ్చయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280